# టపారాలేదు బొట్టుచెరగలేదు

శంకరమంచి సత్యం

రన్నర్ మువ్వల చప్పుడు చేసుకుంటూ టపా తీసుకుని వూళ్ళోకి రాగానే జనం కూడా అతని వెంట పోస్ట్‌మాస్టర్ కిష్టయ్య గారింటికొస్తారు. కిష్టయ్యగారు ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా వుంటూ పోస్ట్ మాస్టర్ గిరీ కూడా నిర్వహిస్తున్నాడు.

కిష్టయ్యగారి వయస్సు యాభై అయిదు. చిన్నప్పుడే తండ్రి పోయాడు. తల్లి యెంత పోరు పెట్టినా పెళ్ళి మాత్రం చేసుకోలేదు. వంశం నిలపడం కోసం కాకపోయినా వండి పెట్టడానికైనా తోడుండాలిరా," అని ఎంత మొత్తుకున్నా విన్పించుకోలేదు. ఆ దిగులుతోనే ఆమె మంచానపడి కిష్టయ్య గారి నలభయ్యోయేట పరమ పదించింది. పోయిన తల్లికి తర్పణాలు విడిచాడుకాని పెళ్ళిమాట తలపెట్టలేదు.

పది రోజులపాటు మండని పొయ్యితో అపసవపుతూ ఇంత అన్నం ఉడకేసుకుంటే, ఎవరింటినుంచో ఎవరైనా ఇంత కూర, చారు పంపించేవారు. పదకొండో రోజున కిష్టయ్యగారు పొయ్యి రాజేస్తూండగా 'బాబుగారూ! మీరు లేవండి. నే వండిపెడతాను' అంటూ సోదెమ్మగారు వచ్చింది. పంతుల్లు విడిచి వరండాలో కొచ్చాడు కిష్టయ్యగారు. ఆనాటి నుంచీ సోదెమ్మగారే ఇంత వండి వార్చి తనూ ఓ ముద్ద తింటోంది!

సోదెమ్మ గారికీ దాదాపు నలభై ఏళ్ళున్నాయి. చిన్నప్పుడెప్పుడో పెళ్ళయి భర్త పోగా, గాజులు కుంకంబొట్టు అసలు గుర్తులేకపోగా, అటువారు ఇటువారుఅంతా వెళ్ళిపోగా నిర్లిప్తంగా తిరుగుతూంటుంది. ఎవరితోనూ మాట్లాడదు. ఆ ముఖంలో దైన్యంకాని, దుఃఖంకాని ఉందందామా అది తెలియదు. ఎవరింట్లో ఏ పని ఉన్నా వెళ్ళి చేసిపెట్టడం, తనకిష్టమైన ఇంట్లో ఇంత ముద్ద తినటం, పదిహేనేళ్ళ నుంచి కిష్టయ్యగారికి వండి పెడుతున్నా అందరిళ్ళకూనూ సాయం చేస్తునే ఉంది. కిష్టయ్య సోదెమ్మ గారు కూడా ఎప్పుడూ మాట్లాడుకోరు.

'బాబుగారూ! భోజనం వడ్డించా' అంది సోదెమ్మ.

భోజనం చెయ్యాక "చింతకాయ పచ్చడి బావుంది సోదెమ్మగారూ" అంటూ చెయ్యి కడుక్కుంటాడు కిష్టయ్య.

తనకిది కావాలని ఈయన అడగడు. ఆవిడ కనుక్కోదు. అలా సాగిపోతూ యాభై ఐదోయేట పడ్డారు ఇద్దరూ.

రన్నర్ తపాలా సంచీ ఇవ్వడమేమిటి. వాకిట్లో జనం కలకలం. కిష్టయ్య ఉత్తరాలు సర్దుకుంటూ ఒకే ఒక దినపత్రికని వాకిట్లోకి విసిరేశాడు. దానిచుటూ మూగారు జనం. ఒకాయన పాటపాడినట్లు వార్తలు చదువుతూంటే ఆ వార్తల కనుగుణంగా సంతోష ఆశ్చర్య విభ్రమాల్ని ప్రకటిస్తున్నారు కొందరు.

కిష్టయ్యగారు కొందరికి ఉత్తరాలు రాసిపెట్టి మనియార్డర్లు పూర్తి చేసి పెట్టి మళ్ళీ తపాలా సంచీ సర్ది రన్నర్‌కిచ్చేసి వాకిట్లోకి వచ్చారు.

ఆయనే పోస్టు జవాను కూడా.

చేతిలో సర్దిన ఉత్తరాలు.


"సుబ్బయ్యా ఇవ్వాళ నీకు కార్డు లేదయ్యా! రంగయ్యా! మీ అబ్బాయి రేపొస్తున్నాట్ట ఇదిగో ... బాలమ్మా నీ కొడుకు పది రూపాయలు పంపించాడు. ఇక్కడ వేలుముద్ర వెయ్యి...." అంటూ అక్కడి జనాన్ని పంపించేసి వీధిలో కొచ్చాడు.

వెంకయ్య ఇంటిముందు అరుగుమీద కూర్చుని "వెంకయ్యా! పంచదార తీసుకు రావోయ్!"

"చెప్పండి విషయం" అంటూ వెంకయ్యరాగా ముందు పంచదార పెట్టించుకుని 'నీకు మనవడు పుట్టాడయ్యా!" అంటూ కార్డు చేతికిచ్చాడు. వెంకయ్య ముఖం వెలిగిపోయింది. కిష్టయ్యగారికీ అంత ఆనందమైంది.

పక్క వీధిలోకొచ్చి "వెంకాయమ్మా! నువ్వేం కంగారుపడకు. నీ కూతురికి జ్వరంగా ఉందిట. ఈ రోజుల్లో జ్వరాలేం చేస్తాయి" అని ధైర్యం చెప్తూ ఉత్తరం చదివి "రేపు పథ్యం పెట్టే ఉత్తరం తీసుకొస్తాగా" అని హామీఇచ్చి ఇంకో వీధిలోకెళ్ళాడు. అలా అన్ని వీధులూ తిరిగి ఉత్తరాలిస్తూ అందరి. ఆనందం పంచుకుంటూ, కష్టాల్లో ఉన్నవాళ్ళని సముదాయిస్తూ, ఓదారుస్తూ గూడెం దగ్గరకొచ్చాడు.

కిష్టయ్యగారొచ్చేవేళకి మరియమ్మ చెట్టు దగ్గర నుంచుని రోజూ ఎదురు చూస్తూ ఉంటుంది మిలట్రీలో ఉన్న భర్త నించి ఉత్తరం కోసం. ఉత్తరం వస్తే కాదు గాలిలో ఎగరేసుకుంటూ వస్తాడు కిష్టయ్య గారు. లేకపోతే మరియమ్మని కూర్చో పెట్టి తనూ కూర్చొని "దేవుడ్ని నువ్వు కావాలని చేసుకున్నాడు. మరిచిపోడు! నమ్ము! సైన్యం అంటే సామాన్యమా? తీరికుండదు. రేపు చర్చికివెళ్ళు సోమవారా



నికి ఉత్తరం వస్తుంది" అని నచ్చచెప్పి బయలు దేరాడు.

అలా వూరందరికీ ఆత్మ బంధువైన కిష్టయ్యగార్ని రాత్రి ఎనిమిది గంటలకి నోటుబిళ్ళ కావాలని లేపినా విసుక్కోక బిళ్ళఇచ్చి "అప్పులుచేసి పాడవకండ్రా" అని హితోపదేశం చేస్తాడు.

శుక్రవారం ఉదయం సోదెమ్మగారు స్నానంచేసి దేవుడికి దణ్ణం పెడుతుంటే కిష్టయ్యగారి మనసు కలుక్కుమంది. ఇంతమందికీ ఓదార్పు మాటలు చెప్తున్నాను. ఈవిడకి నేనేం చెయ్యలేకపోతినే' అనుకున్నాడు.

"సోదెమ్మగారూ!" అని పిలిస్తే ఆవిడొచ్చి నుంచుంది.

"మీ ముఖానికి బొట్టుంటే ఎలా ఉండునో!" అన్నాడు కిష్టయ్యగారు.

సోదెమ్మ నిర్వేదంగా నవ్వనూ లేదు. చేతుల్తో ముఖం కప్పుకోనూలేదు. ఆమెలో ఏ చలనమూ లేదు.

"మీకు నేను బొటు పెడ్తాను" అన్నాడు. కిష్టయ్యగారు.

"బాబుగారూ, బొట్టున్నా లేకపోయినా నేను నేనేకదా" అంది సోదెమ్మగారు

"అది నా కోరిక. మీరు కాదనకండి" అంటూ దేవుడి దగ్గర కుంకం తీసుకొచ్చి సోదెమ్మ నుదుట అద్దాడు. ఆవిడ ముఖం వెలిగిపోతున్నట్లనిపించింది కిష్టయ్య గారికి. కాని సోదెమ్మ మాత్రం ఎలా వచ్చిందో అలాగే ఇంట్లోకెళ్ళి వంటపని చేసికొంది.

మర్నాడు ఉత్తరాలకొచ్చిన జనానికి కిష్టయ్యగారు చెప్పాడు "నేను సోదెమ్మ గారికి బొట్టు పెట్టానయ్యా" అని. ఎవరూ 'ఇదేం విడూరం?' అనలేదు. వ్యంగ్యంగా నవ్వలేదు. మనసా సంతోషించారు. కళ్ళలో నీళ్ళు తిరగ్గా భక్తితో ఆయన్ని చూశారు.

బొట్టయితే పెటుకు తిరుగుతుందేకాని సోదెమ్మ గారిలో ఏ మార్పూ లేదు.

కిష్టయ్యగరూ అంతే. ఒక రోజు కిష్టయ్యగారు హఠాత్తుగా పోయారు. వూరు వూరంతా గొల్లుమంది. సోదెమ్మ గారు అలాగే ఉంది. శోకం లేని ఆ ముఖాన్ని చూస్తుంటే జనానికి కళ్ళు చెరువులై పోతున్నాయి. ఘనంగా అంత్యక్రియలు చేశారు.

మర్నాడు రన్నర్ టపా తీసుకు రాలేదు.

వూరందర్ని వోదార్చిన కిష్టయ్య గారికి కృతజ్ఞత చెప్పుకునేందుకన్నటు సోదెమ్మగార్ని ఓదార్చటానికి జనమంతా, వూరేగింపుగా వచ్చారు. "ఎంతకష్టమొచ్చె! అయ్యో! అయ్యో! "అని తలా ఒకమాట.

సోదెమ్మగారిలో ఏ చలనమూ లేదు.

కిష్టయ్యగారి మంచం పక్కన మామూలుగానే కూర్చుంది.

ముఖంపైన బొట్టు మాత్రం చెరప లేదు. ★


MAHARAJAS ARE FORGOTTEN
BUT NOT THEIR
SPLENDOUR & STYLE

Now : You can live in Regal style and Royal comfort at the Prestigeous

maharaja's suite
HOTEL
at mamata

* Superbly designed for style and comfort.
* Breath-taking bathroom with bath tub, telephone, piped music and fans.
* Refrigerator, wall to wall carpet and many other features

You can present a "HONEYMOON GIFT COUPON" for a newly married Couple or Host a compact meet or even Shoot a movie.

ALL THIS ON A SPECIAL FABULOUS DISCOUNT TARIFF, HURRY UP AND RESERVE NOW

You are most welcome to have a look by prior appointment between 5 & 7 p. m. Dial 61251 - Reception, Hotel Mamata, Vijayawada.



HOTEL
mamata

హొటల్ మమత
గవర్నరుపేట, విజయవాడ.

మమతతో కూడిన ఆతిధ్యమునకు
రుచికి, శుచికి
'మమత'
ఎయిర్‌కండిషన్డ్ రెస్టారెంట్
దర్శించండి.


Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada - 10. Editor Narla Venkateswara Rao